క్లుప్తంగా

కిడ్నీ బాధితుడికి పింఛన్ పంపిణీ



పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

లేపాక్షి: మండల పరిధిలోని నాగేపల్లి గ్రామానికి చెందిన భజంత్రి గంగరాజు అనే కిడ్నీ వ్యాధిస్తుడికి రూ.10 వేల పింఛన్‌ను గ్రామ సర్పంచ్ మంజునాథ్ చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

నిర్మాణాలు ప్రారంభించకపోతే చర్యలు



మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ ఖాజామైనుద్దీన్

రొద్దం: ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలు ప్రారంభించకపోతే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అనంతచారి, హౌసింగ్ ఏఈ ఖాజామైనుద్దీన్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని తురకలాపట్నం వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లో లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం బిల్లులను సకాలంలో చెల్లిస్తోందని, వెంటనే నిర్మాణాలు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పవన్, ఎంపీటీసీ మాధవి, మాజీ సింగిల్ విండో చైర్మన్ రాజారెడ్డి, ఏపీఓ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలు



చికిత్స పొందుతున్న ఉపాధ్యాయుడు మస్తానప్ప

గోరంట్ల: మండల పరిధిలోని పులగుర్లపల్లి జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో 1998 క్వాలిఫైడ్ ఉపాధ్యాయుడు గాయపడ్డాడు. సీఐ సుబ్బరాయుడు వివరాలమేరకు... కొత్తచెరువుకు చెందిన మస్తానప్ప రెడ్డిచెరువుపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. రోజూ లాగానే స్కూల్‌కు వెళ్లేందుకు తన ద్విచక్ర వాహనంలో రెడ్డిచెరువుపల్లికి బయలుదేరారు. అయితే మర్గమధ్యలో పులగుర్లపల్లి వద్ద జాతీయ రహదారిపై రోడ్డు క్రాస్ చేస్తుండగా బాగేపల్లి వైపు నుంచి వచ్చిన ఇనోవా కారు.. ద్విచక్ర వాహనాన్ని ఢీ కొంది. ఈ ఘటనలో మస్తానప్ప తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వైద్య చికిత్స నిమిత్తం 108 ద్వారా హిందూపురానికి, అక్కడి నుంచి బెంగళూరుకు తరలించారు. విషయం తెలుసుకున్న పలువురు ఉపాధ్యాయులు క్షతగాత్రుడికి ఆర్థికసాయం చేశారు.


ఘనంగా కేటీ శ్రీధర్ జన్మదినం



కేటీ శ్రీధర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పరిగి: కాంగ్రెస్ పార్టీ నేత కేటీ శ్రీధర్ జన్మదిన వేడుకను మంగళవారం సేవా మందిరంలోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఏఐసీసీ మెంబర్, ఏపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేటీ శ్రీధర్‌కు పుష్ప గుచ్చాలందించి, శాలువాలతో సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాప్తాడు నియోజకవర్గ సమన్వయ సభ్యుడు బిల్లే ముత్యాలు, రొద్దం మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, సోమందేపల్లి మండల కన్వీనర్ గంగాధర్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విజేతకు అర్హత పత్రాన్ని అందిస్తున్న అధికారి

పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోటకు చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని టి అక్షయ ప్రతిభ కారంజి పోటీల్లో కన్నడ కవన వాచన పోటీల్లో ప్రథమ స్థానం దక్కించుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. మధుగిరిలో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి ప్రతిభా కారంజి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు విద్యా శాఖ అధికారి తెలిపారు.

ఆశల పల్లకీలో చింత రైతు

- విరగ్గాసిన చింతకాయలు
- కొనుగోలుకు ముందుకొస్తున్న వ్యాపారులు
- 80 శాతం కొత్త పంట వస్తుందని అంచనా



విరగ్గాసిన చింతకాయలు



కోల్డ్‌స్టోరేజ్‌లలో ఉన్న చింత పండు

హిందూపురం అర్బన్: చింత రైతు పంట పండనుంది. గత ఏడాది ఆశించిన స్థాయిలో పంట దిగుబడి లేదు. ఈ సారి వర్షాలు తక్కువగా పడటం చింత రైతులకు అనుకూలించింది. చింతమాన్లు ఈ సారి విరగ్గాశాయి. ప్రతి ఏటా కాయకు వచ్చే పుచ్చుకూడా ఈ సారి లేక పోవడంతో గ్రామాల్లో చిరు వ్యాపారులు చెట్లపైనే పంటకొంటున్నారు. ఈ సారి 80 శాతం పంట చేతికొస్తుందని అంచనా వేస్తున్నారు.

లక్ష క్వింటాళ్లు దాటే అవకాశం

రాష్ట్రంలోనే చింతపండు క్రయ విక్రయాలకు హిందూపురం వ్యవసాయ మార్కెట్ పెట్టింది పేరు. ప్రతి ఏటా లక్ష క్వింటాళ్లకు పైగా పురం మార్కెట్‌కు చింత పండు వస్తుంది. గత ఏడాది మాత్రం చింత పండుకు పుచ్చు రావడంతో రైతులు తీవ్రంగా నష్ట పోయారు. కేవలం 35,833 క్వింటాళ్ల పంట మాత్రమే పురం మార్కెట్‌కు వచ్చింది. ఈ సారి లక్ష క్వింటాళ్లు దాటే అవకాశం ఉందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. 15 వ తేదీ తర్వాత కొత్త పంట వ్యాపార లావాదేవీలు జరుగుతాయంటున్నారు.

కదులుతున్న నిల్వలు

పట్టణంలోని శీతల గోదాముల్లో రెండేళ్లగా చింత పండు నిల్వలు పేరుకొన్నాయి. పట్టణంలోని గోదాముల్లో 80,000 క్వింటాళ్ల సరకు ఉంది. ఇప్పుడిప్పుడే హిందూపురం నుంచి బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, కొచ్చి, కలకత్తా, ఢిల్లీ పట్టణాలకు సరకు లారీల ద్వారా పంపుతున్నారు. శీతల గోదాముల్లోని సరకు మార్కెట్‌లో ఫ్లవర్ రకం క్వింటా రూ. 6000–7500, బెస్ట్ రకం రూ.8000–11000, కరపులి (సూపర్ ఫైన్) రకం రూ. 10,000–15,000 వరకు ధర పలుకుతోంది.

ముందుకొస్తున్న వ్యాపారులు

ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర నుంచి పురం మార్కెట్‌కు ప్రతి ఏటా సరుకు వస్తుంది. డిసెంబర్ నుంచి చేతికొచ్చే పంటను రైతుల నుంచి చెట్లపైనే చిరు వ్యాపారులు కొనుగోలుకు ముందుకు వస్తున్నారు. రైతుల నుంచి ముందస్తుగానే కొని తరువాత పంట చేతికొచ్చే సమయంలో చెట్ల నుంచి కాయలు వేరు చేసి పిక్కలు తీసి మార్కెట్‌కు తరలిస్తారు. వ్యాపారులు ఈ సారి ధరలు బాగా వస్తాయని భావిస్తున్నారు.

'పురం' మార్కెట్‌కు మూడేళ్లుగా వచ్చిన చింత పండు

సంవత్సరం	క్వింటాళ్లు	విలువ (రూ.లక్షల్లో)	మార్కెట్ ఫీజు (రూ.లక్షల్లో)
2021-22	1,01,153	7,425.49	74.25
2022-23	1,06,034	8,044.04	80.44
2023-24	35,833	2,818.50	28.19

పంట బాగుంది



మార్కెట్‌లో నాణ్యమైన సరకు మార్కెట్‌కు రాకపోవడం, ధరలు ఆశాజనకంగా లేక పోవడంతో శీతల గోదాముల్లో నిల్వలు ఉంచారు. హిందూపురంలోని గోదాముల్లోనే 800–900 లారీల వరకూ నిల్వ ఉంది. వారంలో సోమ, గురు వారాల్లో లావాదేవీలు ఉంటాయి. ఈ సారి పంట బాగుంది. దిగుబడులు బాగా వచ్చే అవకాశం ఉంది.

– వేణుగోపాల్‌రెడ్డి, శీతలగోదాము యజమాని, హిందూపురం

ఎక్కువ సరుకు వచ్చే అవకాశం



వర్షాలు తక్కువ పడటంతో ఈ సారి పంటకు పుచ్చులేదు. 80 శాతం పంట వస్తుందని అంచనా వేశాం. లక్ష క్వింటాళ్ల వరకు హిందూపురం మార్కెట్‌కు రానుంది. అందుకు అనుగుణంగా మార్కెట్‌లో సదుపాయాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– కిషోర్, మార్కెట్ కార్యదర్శి, హిందూపురం

పేకాటరాయుళ్ల అరెస్టు

హిందూపురం: పట్టణంలోని సింగిరెడ్డిపల్లి వద్ద పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.7,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

కుల గణనపై నేడు సమావేశం

గోరంట్ల/చిలమత్తూరు: కుల గణనపై బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక అవగాహన సమావేశం ఏర్పాటు చేసినట్లు గోరంట్ల, చిలమత్తూరు ఎంపీడీఓలు రఘునాథ గుప్తా, నరేష్ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

పకడ్బందీగా కుల గణన



పరిగి: మాట్లాడుతున్న ఎంపీడీఓ సరస్వతి

పరిగి/లేపాక్షి/పెనుకొండ రూరల్: సమగ్ర కులగణనకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని, క్షేత్ర స్థాయిలో ప్రజాప్రతినిధుల సహకారంతో పకడ్బందీగా కులగణన చేయాలని అధికారులు సిబ్బందికి సూచించారు. పరిగి, లేపాక్షి, పెనుకొండ పట్టణంలో మంగళవారం కుల గణనపై ప్రజాప్రతినిధుల, సచివాలయ ఉద్యోగుల, వీఆర్వోలతో కుల గణనపై ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు, కమ్యూనిస్టు, ప్రజాసంఘల నాయకులు పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేశారు. కుల గణనతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని వారు తెలిపారు.

రేపే మడకశిరలో 'బస్సుయాత్ర'

- తరలిరానున్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు
- ఏర్పాట్లు ముమ్మరం చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: నియోజకవర్గ కేంద్రమైన మడకశిరలో వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సుయాత్ర గురువారం జరగనుంది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీకి చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితర నాయకులు మడకశిరకు తరలిరానున్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరామ్, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషాశ్రీ చరణ్, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, రాజ్య సభ సభ్యులు బీద మస్తాన్‌రావు బస్సుయాత్రలో పాల్గొంటారని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. అదే విధంగా ఎంపీ గోరంట్ల మాధవ్, జిల్లా చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, చైర్‌పర్సన్లు హాజరవుతారన్నారు. బస్సుయాత్ర సందర్భంగా పట్టణంలోని సరస్వతీ విద్యా మందిరంలో మేధావుల సదస్సు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మేధావుల సదస్సు అయిన తర్వాత సరస్వతీ విద్యా మందిరం నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు బస్సుయాత్ర జరుగుతుందని చెప్పారు. బస్సుయాత్ర సందర్భంగా బైక్ ర్యాలీ కూడా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

విజయవంతం చేయండి

పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో ఈనెల 7న (గురువారం) జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి నాయకులు, కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ఆయన మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లా, మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో వేర్వురుగా మడకశిర మున్సిపాలిటీ, మడకశిర రూరల్ మండల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, వివిధ పార్టీ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సమావేశాల్లో బస్సుయాత్ర విజయవంతంపై చర్చించారు. సమావేశంలో మండల, పట్టణ కన్వీనర్లు రామిరెడ్డి, పుట్ట కామప్ప, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: మడకశిరలో గురువారం నిర్వహించనున్న సామాజిక బస్సు యాత్రను విజయవంతం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు పేర్కొన్నారు. మంగళవారం రొళ్ల పట్టణంలో జెడ్పీటీసీ స్వగృహంలో మడకశిర మార్కెట్ కమిటీ చైర్మన్ జయరామప్పతో కలిసి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో పాటు పార్టీ అనుబంధ సభ్యులతో సామాజిక బస్సు యాత్ర విజయవంతంపై చర్చించారు.

కల్లురొప్పం గొల్లహట్టిలో పర్యటించిన ఎమ్మెల్యే

రొళ్ల: మండల పరిధిలోని కల్లురొప్పం గొల్లహట్టి గ్రామాన్ని మంగళవారం ఎమ్మెల్యే తిప్పేస్వామి జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజుతో కలిసి పర్యటించారు. గ్రామాల్లో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. కాలిపోయిన గొర్రెల కల్లాన్ని పరిశీలించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మడకశిర: నియోజకవర్గంలో వాల్మీకుల ప్రధాన సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. వాల్మీకి సేవా సమితి నూతన అధ్యక్షుడిగా మోహన్‌కృష్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం ఆర్‌అండ్‌బీ విశ్రాంత భవనంలో నూతన కమిటీ అధ్యక్షులు మోహన్‌కృష్ణతో పాటు వాల్మీకి సంఘం నాయకులు ఎమ్మెల్యే తిప్పేస్వామిని మర్యాద పూర్వకంగా కలిశారు. వాల్మీకి సంఘం ఈశ్వరప్ప, మాధవరాజు, రవీంద్రప్ప, ఓబులేసు తదితర వాల్మీకి నాయకులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు



దెబ్బతిన్న కాలువను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం: పట్టణంలోని ఎస్‌బీఎస్ సర్కిల్ వద్ద నూతన డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధంచేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అధికారులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని 29వ వార్డు ఎస్‌బీఎస్ సర్కిల్ ప్రాంతంలో చైర్‌పర్సన్, ఇంజరింగ్ అధికారులు పర్యటించారు. జనరల్‌ఫండ్ కింద కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధంచేసి యుద్ధప్రాతికన పనులు చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు చైర్‌పర్సన్ సూచించారు.

8న 'పురం'లో శోభాయాత్ర



మాట్లాడుతున్న వీహెచ్‌పీ నాయకులు

హిందూపురం టౌన్: అయోధ్య శ్రీరాముడి పవిత్ర అక్షింతలతో ఈ నెల 8న పట్టణంలో శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్, హిందూ సంఘాల నాయకులు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. 8న పట్టణంలోని అన్ని వార్డులకు సంబంధించిన అక్షింతలను మేళాపురంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద నుంచి పురవీధుల గుండా వాల్మీకి సర్కిల్లోని శ్రీరామస్వామి దేవాలయం వరకూ శోభాయాత్ర చేపట్టామన్నారు. సమావేశంలో నాయకులు శివకుమార్, నరేంద్ర, వాసుచౌదరి, కేవీ చలపతి, రమేష్‌రెడ్డి, లక్ష్మీనారాయణ గుప్త, బద్రీనాథ్, ఆదర్శ్ పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మ కమలాలు



మడకశిరరూరల్: పట్టణంలోని అదిరెడ్డిపాళ్యంలో రమేష్ ఇంటి ఆవరణలో ఉన్న మొక్కకు బ్రహ్మ కమలాలు వికసించాయి. కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు పూజలు చేశారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



పెనుకొండ: బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం



లేపాక్షి మండలం పులమతిలో సంక్షేమ లబ్ధి బోర్డు ఆవిష్కరిస్తున్న నాయకులు



పరిగి: సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. మంగళవారం శెట్టిపల్లిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, సాయిరాం నాయక్, తిరుపాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నారనాగేపల్లిలో...

రొద్దం: మండల పరిధిలోని నారనాగేపల్లి సచివాలయం వద్ద మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డు ప్రదర్శించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. ఎంపీపీ చంద్రశేఖర్ , వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, సర్పంచ్ నాగార్జున, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆర్‌వి రవిశేఖర్‌రెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజుపల్లిలో...

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక సర్పంచ్ మల్లక్క అధ్యక్షతన వైస్ ఎంపీపీ వేదవతి నేతృత్వంలో ఎంపీడీఓ సరస్వతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ మురళీమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, జేసీఎస్ కన్వీనర్ గంగాధర్ రెడ్డి, పార్లమెంటరీ ఎస్సీ సెల్ నాయకుడు కిరణ్, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: మండలంలోని మలసముద్రంలో మంగళవారం 'వై ఏపీ నీడ్స్ జగన్ 'కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. సచివాలయ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, సర్పంచ్ భార్త వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

మైదుగోళంలో...

లేపాక్షి: మండల పరిధిలోని మైదుగోళంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజాభిప్రాయ సేకరణ పుస్తకాలను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, నాయకులు రామాంజినప్ప, రవి, సుధాకర్, మహమ్మద్, శివ, క్రిష్టప్ప, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు పులమతి గ్రామ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు నాగజ్యోతి, వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



గోరంట్ల: సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న నాయకులు



రొద్దం మండలం నారనాగేపల్లిలో జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

చెరువులను నింపండి

హిందూపురం టౌన్: హంద్రీనీవా ద్వారా హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న చెరువులన్నింటినీ నీటితో నింపాలని జలసాధన సమితి, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ స్వర్ణలతకు వినతిపత్రం అందజేశారు. జయరామిరెడ్డి, గంగిరెడ్డి, ఓపీడీఆర్ శ్రీనివాసులు, శివశంకర్, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

పెనుకొండ రూరల్: సమాజాన్ని పీడిస్తున్న మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలపై మంగళవారం స్థానిక బీటీఆర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సెబ్ సీఐ వెంకటసుబ్బారెడ్డి ఈ సందర్భంగా విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను తెలిపారు.

సబ్సిడీతో రాగుల పంపిణీ

అగళి/గుడిబండ/మడకశిర రూరల్: రైతు భరోసా కేంద్రాల ద్వారా 50 శాతం సబ్సిడీతో విత్తన రాగులు పంపిణీ చేపడుతున్నట్లు అగళి, గుడిబండ, మడకశిర మండల వ్యవసాయాధికారులు శేఖర్ నాయక్, వీరనరేష్ , తిమ్మప్ప ఓ ప్రకటనలో తెలిపారు. నాలుగు కేజీల బ్యాగు ధర రూ.139 చెల్లించి రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.